
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్ణాటక వార్తలు
మంగళవారం 27 ఆగస్టు 2024



కాంగ్రెస్ ఎమ్మెల్యేపై బీజేపీ ఫిర్యాదు

బెంగళూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మండ్య కాంగ్రెస్ ఎమ్మెల్యే రవి కుమార్ గౌడ అలియాస్ రవి గణిగపై బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.రాజీవ్ హుబ్బళ్లి పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుట్ర సాగుతోందని, ఎమ్మెల్యేలకు వంద కోట్ల ఆఫర్ ఇచ్చారని చేసిన ఆరోపణలపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల సాగుతున్న కొన్ని పరిణామాలను తప్పించేందుకై రాజకీయ దురుద్దేశ్యంతోనే రవి గణిగ ఈ ఆరోపణలు చేశారని అన్నారు. కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషిని పరువు తీసేలా వ్యాఖ్యానించారని, ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గోకులకృష్ణా.. గోపాలకృష్ణా..!





ఇస్కాన్‌లో ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

- రాష్ట్రమంతటా కృష్ణాష్టమి వేడుకలు
- ఇస్కాన్‌కు పోటెత్తిన జనం

బెంగళూరు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ఊరూ వాడా అంతటా కృష్ణ నామ జపమే కనిపించింది. శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా వాడవాడలా వేడుకలను ఘనంగా నిర్వహించి గోకుల కృష్ణుడికి భక్తకోటి నీరాజనాలర్పించారు. రాష్ట్ర వ్యాప్తంగా వున్న కృష్ణమందిరాలతోపాటు నగరంలోని ఇస్కాన్ మందిరం భక్తులతో పోటెత్తాయి. ప్రముఖ సంస్థలు, ఆలయ కమిటీల నేతృత్వంలో చిన్నారుల రాధాకృష్ణ వేషధారణ పోటీలు, ఉట్టి పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. నగరంలోని ఇస్కాన్ మందిరంలో బలరామకృష్ణులు, రాధాకృష్ణులకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించగా భక్తులు తరలి వచ్చారు. హరేకృష్ణ నామ స్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. గోవర్ధన గిరి నమూ నా ఆకట్టుకుంది. మల్లేశ్వరంలోని వేణుగోపాలస్వామి ఆలయం, విద్యాపీఠ సర్కిల్‌లోని శ్రీకృష్ణుడి ఆలయంలోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొన్ని చోట్ల తులాభారం నిర్వహించారు. నగర వ్యాప్తంగా ఉదయం నుంచి రాత్రి వరకు పలు ఆలయాల్లో సందడి నెలకొంది.



రాధాకృష్ణులకు క్షీరాభిషేకం



గోవర్ధనగిరి నమూనా



విద్యాపీఠలో స్వామివారికి తులసి ఆకులతో పూజలు





ఇస్కాన్‌లో భక్తుల సందడి



మొక్కులు తీర్చు కుంటున్న భక్తులు





← గంధంతో అలంకరణ... తులాభారం ఇలా...

విద్యుత్ శాఖకు కాసుల వర్షమే..!

- కలిసొచ్చిన వర్షాలు
- నిండిన జలాశయాలు
- తగ్గిన వాడకం
- మరో పది నెలలు ఢోకా లేదు



బెంగళూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): రెండేళ్ల వ్యవధితో పోలిస్తే రాష్ట్రాన్ని వరుణుడు కరుణించాడు. నిరంతర వర్షాలతో 30 జిల్లాల్లోనూ జలకళ తొణికిసలాడుతోంది. వాగులు, వంకలు పొర్లాయి. జలాశయాలు నిండుకుండలా కళకళలాడుతున్నాయి. ఈ పర్యవసానం విద్యుత్ వాడకాన్ని భారీగా తగ్గించింది. రెండున్నర నెలలుగా తీరప్రాంత జిల్లాలు, పశ్చిమ కనుమల అనుబంధమైన ఆరేడు జిల్లాల్లో ఎడతెరిపిలేని వర్షాలు కురుస్తున్నాయి. ఉత్తర కర్ణాటక జిల్లాలకు వరుణుడి ప్రతాపం కంటే కృష్ణా జలాల వరద పోటెత్తింది. ఇలా రాష్ట్రమంతటా చల్లదనం పరుచుకుంది. ఓ వైపు విద్యుత్ వాడకం తగ్గడం, మరోవైపు జల విద్యుత్ కేంద్రాల వైభవం కొనసాగుతోంది. దీంతో ఆ శాఖకు ఆదాయం కూడా భారీగా పెరగనుంది. కావేరి, శరావతి, కాళి, కృష్ణానదికి అనుబంధమైన విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు నిరంతరం పనిచేస్తున్నాయి. శరావతి పరిధిలోని లింగనమక్కి జలాశయం భర్తీ కావడం ద్వారా ఐదేళ్ల తర్వాత పొంగి ప్రవహించింది. కృష్ణానదికి అనుబంధమైన ఆల్మట్టి డ్యామ్ నిండింది. పూర్తి సామర్థ్యంతో 290 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సాధ్యమవుతోంది. జలవనరుల ద్వారా 4,156 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తికి సాధ్యం కానుంది. ఇందులో సూపా జలాశయంలో 2,426.37, మాని డ్యామ్‌లో 5,088.28 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తికి సాధ్యమయ్యేంత నీరు ఉంది. ప్రతి రోజూ సరాసరిన 232.66 మిలియన్ యూనిట్లు సాధ్యమయ్యేంతటి నీరు జలాశయాలలో ఉంది. ఈ నీటితో రానున్న 240 రోజులు విద్యుత్ ఉత్పత్తి సాధ్యం కానుంది. నిల్వ ఉండే జలాశయాల ద్వారా 5శాతం నీరు వదిలినా 225 రోజుల ఉత్పత్తికి ఢోకా లేదు. విద్యుత్ సరఫరా కంపెనీల పాలిట జలోత్సవ సంవత్సరంగా మారిందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. రాష్ట్రంలోని జల విద్యుత్ విభాగాల ద్వారా నిరంతర విద్యుత్ ఉత్పత్తి సాగుతోంది. శరావతిలో 873 మెగావాట్లు (1035 సామర్థ్యం), వారాహి 148 మెగావాట్లు (460 సామర్థ్యం), కొడసళ్లి 113 మెగావాట్లు (120 సామర్థ్యం), ఖద్ర 98 మెగావాట్లు (150 సామర్థ్యం) వీటితోపాటు గేరుసొప్ప, నాగజరి, జోగ, సూపా, శింషాతోపాటు పలు విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో నిరంతరంగా ఉత్పత్తి సాగుతోంది.

విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకు వరం

రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలతో విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకు డిమాండ్ తగ్గింది. ప్రస్తుతం బళ్లారిలోని బీటీపీఎస్‌లోని మూడింట రెండు కేంద్రాల ద్వారా 634 మెగావాట్లు (1700 మెగావాట్ల సామర్థ్యం) ఉత్పత్తి సాధ్యమవుతోంది. ఒక యూనిట్‌కు విశ్రాంతి కల్పించారు. రాయచూరులోని ఆర్‌టీపీఎస్‌లో 6 యూనిట్ల ద్వారా 826 మెగావాట్లు (1720 మెగావాట్ల సామర్థ్యం) విద్యుత్ ఉత్పత్తి సాధ్యమవుతోంది. రెండు యూనిట్లకు విశ్రాంతి ఇచ్చారు. ఎరమ్‌ఎల్‌లో రెండింటిపైకి ఒక యూనిట్ ద్వారా 394 మెగావాట్లు (1600 మెగావాట్ల సామర్థ్యం) ఉత్పత్తి సాధ్యమవుతోంది. ఉడుపిలో 1200 మెగావాట్ల సామర్థ్యంలోని మూడు కేంద్రాలకు విశ్రాంతినిచ్చారు. గత ఏడాది బీటీపీఎస్ కేంద్రంలో గరిష్టంగా 8208 మెగావాట్ల ఉత్పత్తి సాధ్యమయ్యేది. మొత్తంగా నైరుతి రుతుపవనాల ప్రభావంతో ఉత్తమమైన వర్షాల కారణంగా రాష్ట్రంలోని అన్ని విభాగాల్లోనూ సగానికి విద్యుత్ ఉత్పత్తి తగ్గించారు.

విద్యుత్‌శాఖకు పెరగనున్న ఆదాయం

విద్యుత్‌శాఖకు ఈ ఏడాది కాసుల వర్షం కురవనుంది. ప్రతి యూనిట్ ఉత్పత్తికి రూ.1.35 ఖర్చుకానుండగా వినియోగదారుల నుంచి రూ.5.80 వసూలు చేస్తున్నారు. దీనికితోడు ఎక్కువ విద్యుత్ ఉత్పత్తి ద్వారా కూడా ఆదాయం పెరగనుంది. నిత్యం విద్యుత్ డిమాండ్ 7,300 మెగావాట్లు కాగా రోజూ వాడకం 208 మిలియన్ యూనిట్లకు తగ్గింది. జల విద్యుత్ ఉత్పత్తి ద్వారా 38 మిలియన్ల యూనిట్లు, థర్మల్ పవర్ ద్వారా 57 మిలియన్ యూనిట్ల ద్వారా సమతుల్యం చేసేవారు. వేసవిలో తీరికలేకుండా థర్మల్ విద్యుత్ కేంద్రాల ద్వారా ఉత్పత్తి సాగేది. అదనపు విద్యుత్ ఉత్పత్తి సాధ్యమవుతుండడం ద్వారా ఇతర రాష్ట్రాలకు విక్రయం ద్వారా కూడా ఆదాయం పెరగనుంది. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి జూలై 29వరకు ఆరు నెలల వ్యవధిలో యూనిట్ వాస్తవ ధర రూ.5.24 ప్రకారం 2680.06 మిలియన్ యూనిట్లు విక్రయించి రూ.1403.06 కోట్ల ఆదాయం గడించారు.

కలసి వస్తున్న తక్కువ ధర

థర్మల్‌పవర్, పవన విద్యుత్, సౌర విద్యుత్‌లతోపాటు ఇతర విద్యుత్ ఉత్పత్తుల ధరలతో పోలిస్తే జల విద్యుత్ ఉత్పత్తి ఖర్చు గణనీయంగా తగ్గింది. తక్కువ ధరలో విద్యుత్ ఉత్పత్తి ఎస్కామ్‌కు కలసి వస్తోంది. జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ద్వారా ప్రతి యూనిట్‌కు సరాసరిన రూ. 1.35 ధర కానుంది. గృహజ్యోతితోపాటు ఇతర పథకాల లబ్ధిదారులకు ప్రతి యూనిట్‌కు రూ.5.80 చొప్పున చెల్లిస్తున్నారు. తక్కువ ధరతో విద్యుత్ ఉత్పత్తి చేసి ఎస్కామ్‌లకు కలసిరానుంది. రాష్ట్ర ఖజానా నుంచి సబ్సిడీ రూపంలో భరించాల్సిన మొత్తం కూడా తగ్గనుంది. థర్మల్, సౌర, పవన ఇతర విద్యుత్ ఉత్పత్తి యూనిట్‌కు రూ.5 చొప్పున లభ్యమవుతుండగా జల విద్యుత్ మాత్రమే తక్కువ ధరకు సాధ్యమవుతోంది. శరావతి కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి అయ్యే ధర యూనిట్‌కు 71 పైసలు, మహాత్మాగాంధీ జల విద్యుత్ కేంద్రం ద్వారా రూ.1.12, గేరుసొప్పలో రూ.2.07, కాళిలో 92 పైసలు, వారాహిలో రూ. 1.92 కు లభ్యం కానుంది. నష్టాల నుంచి బయటపడేందుకు కర్ణాటక పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ (కేపీసీఎల్) బకాయిలలో కొంతమేర చెల్లింపులకు 5 విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు శక్తిని ఇవ్వనున్నాయి. ఈ ఏడాది కురిసిన వర్షాలు జలాశయాలలో నీటి మట్టంతో కలిపితే 2025 జూన్ వరకు విద్యుత్ కోతలు ఉండవనే అంచనాలు ఉన్నాయి.

హైకోర్టు తీర్పుపైనే సిద్ధూ భవితవ్యం

- భరోసా ఇస్తూనే ప్రత్యామ్నాయాన్ని పరిశీలిస్తున్న అధిష్టానం
- బీసీలు సీఎం కావడం బీజేపీకి ఇష్టం లేదు: సీఎం



గోకాక్ తాలూకా కౌజళగిలో ఖడ్గం చూపుతున్న సిద్ధరామయ్య

బెంగళూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): 'ముడా' వివాదంలో కాంగ్రెస్ అధిష్టానం ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నా ప్రత్యామ్నాయ ఆలోచనలు కూడా చేస్తున్నట్టు పార్టీ వర్గాల్లో చర్చలు సాగుతున్నాయి. అందరినీ సమన్వయ పరిచేవారు ఎవరనే కోణంలో కూడా అధిష్టానం పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది. దీన్నిబట్టి హైకోర్టు తీర్పుపైనే సిద్ధూ భవిష్యత్తు ఆధారపడి ఉంటుందనే చర్చ సాగుతోంది. ముడా అవినీతికి సంబంధించిన కేసుపై ఈనెల 29న హైకోర్టు తీర్పు ఇవ్వనుంది. ఒకవేళ సిద్ధరామయ్యకు తీర్పు వ్యతిరేకంగా వస్తే నాయకత్వ మార్పు తథ్యమనే వాదన వినిపిస్తోంది. హైకోర్టు తీర్పును బట్టి నిర్ణయం తీసుకోవాలని అధిష్టానం ఇప్పటికే సున్నితంగా సూచించినట్టు తెలుస్తోంది. దీన్ని బట్టి హైకోర్టు తీర్పు వ్యతిరేకంగా వస్తే రాజీనామా అనివార్యమైనా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు. పార్టీపై వ్యతిరేక ప్రభావాలు చూపేలాంటి ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దని సిద్ధరామయ్యకు అధిష్టానం సూచించినట్టు సమాచారం. ప్రారంభంలో రాష్ట్రమంతటా కాంగ్రెస్ కార్యకర్తలు, కురుబసంఘాలు ఆందోళన చేశాయి. తర్వాత సంఘాలు, పార్టీ ఆందోళనలు కొనసాగించకపోవడానికి అదే కారణమని తెలుస్తోంది. జమ్ము-కశ్మీర్, హరియాణ ఎన్నికల తరుణంలో వ్యతిరేకత అనేది ఉండరాదని అధిష్టానం నిర్ణయించినట్టు తెలుస్తోంది. కాగా, సిద్ధరామయ్య తరపున 'అహింద' ఆధ్వర్యంలో మంగళవారం ఫ్రీడంపార్కులో ఆందోళన చేయనున్నారు. మంత్రి సతీశ్‌జార్కిహొళి నేతృత్వంలో చలో రాజ్‌భవన్ పేరిట నిరసన చేపట్టాలని భావిస్తున్నారు. ఈ ప్రభావం ఎక్కడికి దారి తీస్తుందోనని అధిష్టానం పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది. కోర్టు తీర్పుపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

బీసీలు సీఎం కావడం బీజేపీ సిద్ధాంతానికి వ్యతిరేకం : సీఎం

'బీసీలు ముఖ్యమంత్రి కావడం బీజేపీ సిద్ధాంతాలకు వ్యతిరేకం.. మీ ఆశీర్వాదం ఉండేంతవరకు నన్ను ఎవరూ కిందకు దించలేరు' అని సీఎం సిద్ధరామయ్య పేర్కొన్నారు. బెళగావి జిల్లా గోకాక్ తాలూకా కౌజళగిలో సోమవారం సంగొళ్లిరాయణ్ణ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. బీసీ వర్గాలకు చెందిన వారు సీఎం కారాదనేది బీజేపీ పురాతన సిద్ధాంతమని విమర్శించారు. ఎలాంటి తప్పులు లేకున్నా తనపై కుట్రతో ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. 40 ఏళ్ల రాజకీయంలో తనపై లేని మరకలను సృష్టిస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో మంత్రులు సతీశ్ జార్కిహొళి, లక్ష్మీ హెబ్బాళ్కర్, ఎమ్మెల్యే బాలచంద్ర జార్కిహొళి తదితరులు పాల్గొన్నారు.

వివాదాల కేంద్రంగా పరప్పన అగ్రహార జైలు

- వివాదాస్పదంగా అధికారుల తీరు
- దర్శన్ హల్‌చల్‌తో మరోసారి తెరపైకి..

బెంగళూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పరప్పన అగ్రహార జైలు మరోసారి వివాదాల కేంద్రమైంది. ఇక్కడి జైలు అధికారుల తీరుపై మంత్రులు, ఉన్నతాధికారులు, న్యాయమూర్తులు ఆశ్చర్యం వ్యక్తం చేసిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. బెంగళూరు కేంద్రంగా ఉండే పరప్పన అగ్రహార జైలు సాధారణ ఖైదీలు జ్యుడీషియల్ రిమాండ్ రూపంలో చేరుతుండగా ఉగ్రవాద చర్యలు, దారుణహత్య కేసులో నిందితులు యావజ్జీవ కారాగారశిక్షకు గురైనవారు ఇక్కడే ఉంటున్నారు. దశాబ్దాల కాలంగా పరప్పన అగ్రహార జైలుకు సంబంధించి ఎన్నో సందర్భాల్లో అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత అక్రమాస్తుల కేసులో అరెస్టు అయినప్పుడు ఆమెకు రాజభోగాలు కల్పించారనే విమర్శలు వినిపించాయి. జయలలిత ఆప్తురాలు శశికళ ఇదే కేసులో శిక్షకు గురై ఏళ్ల తరబడి జైలులో గడిపారు. ఆమెకు సౌలభ్యాలు కల్పించేందుకు కోట్లది రూపాయలు చేతులు మారాయనే ఆరోపణలు వచ్చాయి. పైగా ఆమె షాపింగ్‌కు వెళ్లేవారనే విమర్శలు కూడా వచ్చాయి. ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడి జైలులో గడుపుతున్నవారే వ్యూహాత్మకంగా వ్యవహరించి గతంలో కొందరిని ఉగ్రవాద చర్యలకు ప్రేరేపించడంతోపాటు తాజాగా ఇదే ఏడాది రామేశ్వరం కెఫెలో బాంబుపేలుళ్లకు కారకులయ్యారనేది తెలిసిందే. జైలు నుంచే బాడీవారెంట్ ద్వారా అదుపులోకి తీసుకుని విచారణలు జరిపారు. ఇలా రెండున్నర నెలలుగా విచారణ ఖైదీగా జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న నటుడు దర్శన్‌కు ఇంటి భోజనం అందించే విషయంలో కోర్టు నిరాకరించిన సంగతి విదితమే. విచారణ ఖైదీకి కోరుకున్న సౌలభ్యాలు కల్పించలేమని స్పష్టం చేసింది. జైలులోనే బ్యారక్ ఎదురుగా కుర్చీలు వేసుకుని ఓ రిసార్టు తరహాలో నలుగురు మీటింగ్ పెట్టడం, పైగా కాఫీ, సిగరెట్ తాగుతున్న దృశ్యాలు వైరల్ అయ్యాయి. మరోవైపు పక్క బ్యారక్‌లో ఉండే ఓ నిందితుడు బయట ఉండే రౌడీషీటర్‌కు వీడియోకాల్ చేసి దర్శన్ ద్వారా హాయ్ అనిపించాడు. కోర్టు స్పష్టంగా ఇంటి ఆహారానికి అనుమతి ఇవ్వలేమని పేర్కొన్నా జైలు అధికారులే అతడికి అన్ని విధాలా సౌలభ్యాలు కల్పించడం సర్వత్రా విమర్శలకు కారణమవుతోంది. రెండు రోజుల కిందటే పోలీసు అధికారులు మెరుపుదాడి చేయగా గంజాయి, మొబైల్‌తోపాటు పలు వస్తువులు లభించాయి. అంతలోనే దర్శన్ విలాసాలు వైరల్ అయ్యాయి.



పరప్పన అగ్రహార జైలు

మురిపించిన మురారి



రాధాకృష్ణుల వేషధారణలో విద్యార్థులు

బళ్లారి సిటీ/రూరల్/కంప్లి, ఆగస్టు 26: చిన్ని కృష్ణుడు అలరించారు..వెన్న దొంగ మురిపించాడు..ముద్దులొలికే గోపికలు సుందరంగా అలంకరించుకుని హొయలు పోయారు. కృష్ణాష్టమి వేడుకలను సోమవారం ఉభయ జిల్లాల్లో ఘనంగా జరుపుకున్నారు. బళ్లారిలో పలు సంస్థలు, సంఘాల ఆధ్వర్యంలో, పాఠశాలల్లో కృష్ణాష్టమిని జరుపుకున్నారు. శ్రీకృష్ణుడి ఆలయాలు, రామాలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని అభిషేకాలు, అర్చనలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.



రాధ వేషధారణలో చిన్నారి








రాధాకృష్ణులుగా చిన్నారుల సందడి





జిల్లా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో...






రామేశ్వరీ నగర్‌లో...



సిరివరం ప్రైమరీ పాఠశాలలో..



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1628.04	1,626.15
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	17,311	1,206
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	10,075	9,784
సామర్థ్యం (టీఎంసీలు)	86.88	80.31

ఎర్రితాతకు ప్రత్యేక పూజలు

బళ్లారిరూరల్, ఆగస్టు 26 : తాలుకా లోని చేళగుర్కి గ్రామం లో మహనీయుడు ఎర్రి తాతకు శ్రావణమాసం మూడవ సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో ఆంధ్ర, కర్ణాటక నుంచి భక్తులు విరివిగా పాల్గొన్నారు. పాల్గొని స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులకు అన్నప్రసాదాలు అందించినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు బాలినగౌడ తెలిపారు.



అలంకరణలో ఎర్రితాత

నాసిరకంగా డ్రైనేజీ పనులు

సిరుగుప్ప, ఆగస్టు 26: పట్టణంలోని 25వ వార్డులో డ్రైనేజీ పనులు నాసిరకంగా జరగడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని ఆదోని రోడ్డు మార్గంలో 25వ వార్డులో రూ. 20 లక్షల వ్యయంతో జరుగుతున్న డ్రైనేజీ పనులు నాసిరకంగా జరుతుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సిమెంట్, ఇసుక వాడకుండా పనులను చేస్తున్నారని, నేలమట్టంలో బెడ్డింగ్‌లు వేయకుండా ఇరువైపులా ఇనుప రాడ్లను బిగించి పనులు చేస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. ఈ విషయాన్ని నగరసభ ఏఈఈ అధికారులకు తెలియజేయగా పరిశీలిస్తామని తెలిపారు.



నాసిరకం కడ్డీలు వాడిన దృశ్యం

పరిశుభ్రతతో అతిసార దూరం: డీహెచ్‌ఓ

బళ్లారి సిటీ, ఆగస్టు 26: పరిశుభ్రత పాటిస్తే అతిసార వ్యాప్తి చెందకుండా ఆపవచ్చని, చేతులను శుభ్రం చేసుకోవడం ద్వారా వ్యాధులకు అడ్డుకట్ట వేయవచ్చని డీహెచ్‌ఓ రమేశ్‌బాబు సూచించారు. సోమవారం సండూరు తాలూకా ఉబ్బలగుండి గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో విరేచనాల కేసులు అధికంగా నమోదు కావడంతో ముందు జాగ్రత్త చర్యగా తాతాల్కిక ఎమర్జెన్సీ చికిత్స కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. జిల్లా పర్యవేక్షణాధికారి డాక్టర్ మరియంబి నేతృత్వంలో జిల్లా కలరా నియంత్రణ బృందం ద్వారా నీటి మూలాలను పరీక్షించారు. వైద్య బృందం ఇంటింటికీ తిరిగి కాచి వడబోసిన నీటిని తాగాలని, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఆహార పదార్థాలను మూసిఉంచాలని, పిల్లలను రోగుల భారి నుంచి దూరంగా ఉంచాలని తెలిపారు. గ్రామపంచాయితీ నీటి పైప్‌లైన్ పరిశీలించి క్లోరినేషన్ చేశారు. ఈసందర్భంగా గ్రామపంచాయితీ అధ్యక్షుడు నాగేశ్, తాలూకా ఆరోగ్యాధికారి భరత్, హరీశ్, కలరా నియంత్రణ బృందం శివకుమార్, ఉమాదేవి, ఆరోగ్య సిబ్బంది యర్రిస్వామి, రత్నమ్మ, మేఘనా తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో చర్చిస్తున్న డీహెచ్‌ఓ రమేశ్ బాబు

పేద విద్యార్థులకు ఆర్థికసాయం

● వీరశైవ లింగాయత్ సంఘం నాయకురాలు నారా వైజయంతి



బళ్లారి సిటీ, ఆగస్టు 26: కల్యాణ కర్ణాటక ప్రాంతంలోని బళ్లారి, విజయనగరం జిల్లా, కొప్పళ, రాయచూరు, కలబురగి జిల్లాలో 1నుంచి 10వరకు చదువుతున్న (మెట్రిక్)పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేస్తామని వీరశైవ లింగాయత్ సంఘం నాయకురాలు జయంతిరెడ్డి పేర్కొన్నారు. వీరశైవ లింగాయత్ మహాసభ రాష్ట్ర కార్యవర్గ ఎన్నికల్లో పాల్గొన్న అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. వీరశైవ లింగాయత్ సామాజికవర్గానికి చెందిన పేద విద్యార్థుల చదువు కోసం 'బసవన్న అక్షర దాసోహం' పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందిస్తున్నామన్నారు. పేదరికం కారణంగా ఎవ్వరూ చదువుకు దూరం కాకూడదనే ధ్యేయమన్నారు. వీరశైవ లింగాయత్ సమాజం సంఘంలోని మఠాలు వందల సంవత్సరాలుగా త్రివిధ దాసోహాన్ని కలిగి ఉన్నాయన్నారు. పెద్దల వారసత్వాన్ని కొనసాగించి సమాజాభివృద్ధికి కృషి చేయడమే తన సంకల్పమన్నారు.

కమిషనర్‌ను సస్పెండ్ చేయాలి

● గోతిలో పడి బాలుడు మృతిచెందడంపై వెల్లువెత్తిన ఆగ్రహం



హొసపేట నగరసభ కార్యాలయం ముందు బైఠాయించిన నగరసభ సభ్యులు

బళ్లారి గాంధీనగర్, ఆగస్టు 26: నగరసభ కమిషనర్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ సభ్యులు ఆందోళన చేపట్టారు. విజయనగర జిల్లా కేంద్రమైన హొసపేట నగర పరిధిలో అనంతశయన గుడి వద్ద రోడ్డుపై ఏర్పడిన గుంతలో పడి నాలుగేళ్ళ బాలుడు మృతి చెందడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం హొసపేట నగరసభ సభ్యులు, మృతి చెందిన బాలుడి తల్లిదండ్రులు, ప్రజలు పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. నగరంలో రోడ్ల నిర్వహణలో కార్పొరేషన్ కమిషనర్ నిర్లక్ష్యం వహిస్తున్నారని, బాలుడు మృతికి కమిషనర్ నైతిక బాధ్యత వహించాలన్నారు. జిల్లాధికారి జోక్యం చేసుకుని కమిషనర్‌ను సస్పెండ్ చేయాలని నగరసభ సభ్యులు డిమాండ్ చేశారు. పార్టీలకు అతీతంగా పలువురు ఈ ధర్నాలో పాల్గొన్నారు. కమిషనర్ చంద్రప్ప దిష్టిబొమ్మను కార్యాలయం ముందు దహనం చేశారు. ప్రస్తుతం హొసపేట నగరసభకు అధ్యక్షులు లేకపోవడంతో పాలనాధికారిగా జిల్లాధికారి ఉన్నారని, బాలుడు మృతి చెందిన కుటుంబానికి నష్టపరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశారు. సాయంత్రం వరకు ఆందోళన చేపట్టినా జిల్లాధికారి దివాకర్‌గాని, కమిషనర్ గాని స్పందించకపోవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

నేడు నగరసభ అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు



సిరుగుప్ప నగరసభ కార్యాలయం

సిరుగుప్ప, ఆగస్టు 26: నగరసభ అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు మంగళవారం జరుగనున్నాయి అధ్యక్ష పదవికి కాంగ్రెస్ పార్టీలో ఇద్దరు పోటీ పడుతున్నారు. 19వ వార్డుకు చెందిన చంద్రమ్మ, 26వ వార్డుకు చెందిన రేణుకమ్మ బరిలో వున్నారు. ఎస్సీ రిజర్వ్ రావడంతో ఇద్దరు నువ్వా నేనా అన్నట్లు పోటీ పడుతున్నారు. ఇద్దరూ నామినేషన్ దాఖలు చేసినట్లయితే బీజేపీ ఎవరికి మద్దతు ఇస్తుందనే ఉత్కంఠ నెలకొంది. స్థానిక ఎమ్మెల్యే 26వ వార్డుకు చెందిన రేణుకమ్మకు మద్దతు ఇచ్చినట్లు తెలిసింది. కొందరు కౌన్సిలర్లు ఎన్నికల కోసం లక్షలాది రూపాయలు వెచ్చించామని, ఆ డబ్బు కోసం అధ్యక్ష పదవి పొందేవారు. ఇద్దరు సభ్యులూ పెద్దగా శ్రీమంతులు కాకపోవడంతో అంతగా ఇవ్వడానికి సాధ్యపడదని తెలిసింది. అధ్యక్ష పదవి ఎవరిని వరిస్తుందనేది మధ్యాహ్నం 2 గంటలలోపు ఫలితాలు వెలువడనున్నాయి.

గుర్తుతెలియని యువకుడి హత్య



యువకుడి మృతదేహం

తోరణగల్లు, ఆగస్టు 26: గుర్తుతెలియని యువకుడు హత్యకు గురయ్యాడు. తోరణగల్లు పోలీసులు తెలిపిన వివరాల మేరకు తోరణగల్లు సమీపంలోని ఎన్‌హెచ్ 64 బళ్లారి హోస్పేట రోడ్డు కురేకుప్ప గ్రామ సమీపంలో ఓ యువకుడు హత్యకు గురయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. యువకుడి తలకు తీవ్ర గాయాలయినట్లు పోలీసులు గుర్తించారు. యువకుడికి దాదాపు 25 సంవత్సరాల వయసు ఉండవచ్చునని, ఎవరైనా గుర్తిస్తే 9480803062, 9480803010 తోరణగల్లు పోలీస్ స్టేషన్లో సమాచారం అందించాలని ఎస్ఐ తెలిపారు.

మహిళ ఆత్మహత్య

కంప్లి, ఆగస్టు 26 : తాలుకా సమీపం సన్నాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని గొల్లల క్యాంపులో సునీత (36) అనే మహిళ సోమవారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తండ్రి ఫిర్యాదు మేరకు కంప్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు అనంతపురం జిల్లాకు చెందిన సునీత గొల్లలక్యాంపుకు చెందిన మంజు అనే వ్యక్తితో 15 సంవత్సరాల క్రితం వివాహమైంది. అయితే సునీత తమకు పిల్లలు కలగలేదని తరచూ ఆందోళన పడేది. ఉదయం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ, పోలీసులు తెలిపారు.

నిడిగల్ ఉత్సవాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం



ఎమ్మెల్యేను నిడిగల్ ఉత్సవాలకు ఆహ్వానిస్తున్న వాల్మీకి నాయకులు

పావగడ, ఆగస్టు 26 : తాలూకాలోని నిడిగల్ దుర్గంలో సెప్టెంబర్ 2న నిర్వహించే ఉత్సవా లకు పావగడ ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్‌ను వాల్మీకి నాయకులు ఆహ్వానించారు. వారు సోమవారం ఎమ్మెల్యేను కలిశారు. ప్రతి సంవత్సరంలాగే ఈ యేడాది కూడా నిడిగల్ దుర్గాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యేను కోరారు. అదేవిధంగా ఆ ప్రాంతానికి రవాణా సౌకర్యం కల్పించా లని, ప్రాచీన ఆలయాలు, మండపాలు, రాజగోపురాల పునరుద్ధీకరణకు ఎమ్మెల్యే చొరవ తీసుకో వాలని వాల్మీకి జాగృతి వేదిక అధ్యక్షుడు పాలేకర్ లోకేష్ కోరారు. మాజీ మంత్రి వెంకటరమణను కూడా ఈ కార్యక్రమానికి స్వాగతించినట్లు తెలిపారు. పలువురు వాల్మీకి నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పాముకాటుతో యువకుడి మృతి

పెనుకొండ రూరల్, ఆగస్టు 26: రొద్దం మండలంలోని కుర్లపల్లిలో పాముకాటుతో బోయ పార్థ(30) అనే వ్యక్తి సోమవారం మృతిచెందినట్లు స్థానికులు, బంధువులు తెలిపారు. కుర్లపల్లికి చెందిన పార్థ బెంగళూరులో బేకరీలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ఇటీవలే స్వగ్రామానికి వచ్చాడు. ఆదివారం రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా పరుపులో దూరి పాముకరిచింది. వెంటనే గుర్తించిన బంధువులు పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

పేకాడుతున్న 12 మంది అరెస్ట్

గోరంట్ల, ఆగస్టు 26: మండలంలోని కరావులపల్లి శివారు ప్రాంతంలో పేకాడుతున్న 12మందిని సోమవారం అరెస్టు చేసినట్లు సీఐ శ్రీధర్ తెలిపారు. అందిన సమాచారం మేరకు పోలీస్ సిబ్బందితో పేకాట స్థావరంపై దాడి చేశామన్నారు. ఈ దాడిలో 12మందిని అరెస్టు చేసి, వారి వద్దనుంచి రూ.73,370 స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

హోసూరు జోన్

వక్తృత్వ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు



విద్యార్థిని అభినందిస్తున్న యువజన సంఘం సభ్యులు

హోసూరు ఆగస్టు 26 : పట్టణంలో యువజన సంఘం ఆధ్వర్యంలో 'నా జీవితం బాగుంటుంది' అనే అంశంపై కళాకారుల శత జయంతిపై వక్తృత్వ పోటీలు సోమవారం నిర్వహించారు. ఈ పోటీల్లో 11 కళాశాలల నుంచి వంద మందికి పైగా విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. డీఎంకే పశ్చిమ జిల్లా కార్యదర్శి ఎమ్మెల్యే వై.ప్రకాశ్, మేయర్ సత్య, డిప్యూటీ మేయర్ ఆనందయ్య, కార్యక్రమాన్ని ప్రారంభించారు. యూత్ టీమ్ జిల్లా ఆర్గనైజర్ సుమన్ అందరికి స్వాగతం పలికారు. యూత్‌టీమ్ కో ఆర్గనైజర్ కృష్ణన్, నరసింహన్, ప్రభాకరన్, ముజామిల్ భాషా, సీతారామయ్య, మున్సిపల్ యూత్ కో-ఆర్గనైజర్లు శ్రీనివాసన్, ప్యాట్రిక్ ఫెర్నాండెజ్, కార్తీక్, బాలాజీ, లోకేశ్, నాయకత్వం వహించారు. పోటీలకు ముఖ్య పరిశీలకులుగా ఈరోడ్డు ఎంపీ ప్రకాశ్, శ్రీనివాసన్, రాష్ట్ర యూత్ డిప్యూటీ ఆర్గనైజర్లు పాల్గొన్నారు. ఈ పోటీల్లో 16 మంది యువకులు తదుపరి రౌండ్‌కు ఎంపికయ్యారు. వీరికి ఒక్కొక్కరికి రూ.10 వేలు ఇచ్చి అభినందించారు. మరో ఇద్దరు దివ్యాంగులకు రూ.10వేలు ఇచ్చి సత్కరించారు. కార్యక్రమంలో పాల్గొన్న వారందరికీ రూ.1000 అందజేశారు. విద్యార్థులను ప్రోత్సహించడమే యువజన సంఘం ధ్యేయమని వారు పేర్కొన్నారు. అన్ని పాఠశాలల నుంచి ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేశారు. కార్యక్రమంలో హెల్త్ కమిటీ ఛైర్మన్ మాదేశ్వరన్, టాక్స్ కమిటీ ఛైర్మెన్ చెన్నీరప్ప, మండల కమిటీఛైర్మెన్ రవి, జిల్లా కౌన్సిల్ ఛైర్మెన్ యువరాజ్, పాల్గొన్నారు.

ఉత్సాహంగా కృష్ణాష్టమి వేడుకలు



అలంకరణలో రాధారుక్మిణీ సమేత శ్రీకృష్ణుడు

హోసూరు ఆగస్టు 26 : కృష్ణాష్టమి వేడుకలను వాడవాడలా ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలో ప్రసిద్ధి చెందిన రాధా రుక్మిణి, వల్లభ వేణుగోపాల స్వామి ఆలయాల్లో శ్రీ కృష్ణ జయంతిని సోమవారం ఘనంగా జరుపుకున్నారు. స్వామి వారికి ప్రత్యేక సేవలతో సుందరంగా అలంకరించి పూజలు నిర్వహించారు. పట్టణ పరిసర ప్రాంతాల్లోని శ్రీకృష్ణ ఆలయాలు, రామాలయాలు, వెంకటాచలపతి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. వేణుగోపాల స్వామి ఆలయంలో మూలవిరాట్‌కు విశేష అభిషేకాలు నిర్వహించారు. వెన్నతో అలంకరించిన శ్రీకృష్ణుడు విశేషంగా ఆకట్టుకున్నారు. భక్తులు ఉదయం నుంచే క్యూలైన్లో నిల్చుని స్వామిని దర్శించుకున్నారు. శ్రీకృష్ణ, గోపిక వేషధారణలతో చిన్నారులు అలరించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

హోసూరు(సిఫ్‌కాట్) : కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. విశ్వ హిందూ పరిషత్, బజరంగదళ్ సభ్యులు ఇందులో విశేషంగా పాల్గొన్నారు. వంద మందికి పైగా చిన్నారులు కృష్ణ, రాధా వేషాల్లో ఆకట్టుకున్నారు. పట్టణంలోని బైపాస్ రోడ్డు కొత్త పరిషత్ స్థలం నుంచి ప్రారంభమైన శోభాయాత్ర నగరంలోని పలు ప్రధాన రహదారుల గుండా సాగింది. ఈ కార్యక్రమానికి వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు శాంతకుమార్ అధ్యక్షత వహించారు. జిల్లా కార్యదర్శి మంజునాథ్ స్వాగతం పలికారు. సంఘం ఇన్‌చార్జీలు దేవరాజ్, కృష్ణన్, నాయకత్వం వహించారు. అఖిల భారత జాయింట్ సెక్రటరీ నాగరాజ్ , ఉత్తరాది రాష్ట్రానికి చెందిన దుర్గావాగిని నిర్వాహకులు శ్రీను ప్రత్యేక ఆహ్వానితునిగా పాల్గొని ప్రత్యేక ప్రసంగించారు. ఉత్తర తమిళనాడు రాష్ట్ర సంయుక్త కార్యదర్శి విష్ణుకుమార్, రాష్ట్ర బజరంగదళ్ ఆర్గనైజర్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు. జిల్లా సంయుక్త కార్యదర్శి మంజునాథ్ సమన్వయకర్తగా వ్యవహరించారు. జిల్లా ఉపాధ్యక్షుడు సాయి సుభాష్ దన్యవాదాలు తెలిపారు. భక్తులకు అన్నప్రసాదం అందజేశారు.



ఊరేగింపుగా వెళ్తున్న వీహెచ్‌పీ, బజరంగ్ దళ్ సభ్యులు

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

టీఎన్ రాజరత్నం పిళ్ళై (జయంతి)



కర్ణాటక సంగీత విద్వాంసులు తిరుమరుగల్ నటేశపిళ్ళై రాజ రత్నం పిళ్ళై 1898 ఆగస్టు 27న తమిళనాడు రాష్ట్రం తంజావూరులో జన్మించారు. అసలు పేరు బాలసుబ్రమణియన్. అభిమానులు ఆయనను టీఎస్ఆర్‌గా పిలుస్తారు. సంగీతంలో ప్రత్యేకించి తోడి రాగంలో ఎన్నో ప్రయోగాలు చేసి 'నాదస్వర చక్రవర్తి'గా పేరొందారు. అంతేకాక 1939లో 'తిరునీళ కంఠర్' సినిమాలో నాదస్వర కళాకారుడిగా నటించారు. 1947లో స్వాతంత్ర్య సంబరాలకు సంబంధించి ఆలిండియా రేడియోలో కార్యక్రమంలోనూ పాల్గొన్నారు. సంగీత నాటక అకాడమీ అవార్డు సహా పలు పురస్కారాలు అందుకున్నారు. 1956 డిసెంబరు 12న కన్నుమూశారు.

ఓలేటి వెంకటేశ్వర్లు (జయంతి)



ప్రఖ్యాత కర్ణాటక సంగీత విద్వాంసుడు ఓలేటి వెంకటేశ్వర్లు 1928 ఆగస్టు 27న తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో జన్మించారు. హిందూస్తానీ సంగీతాన్ని డాక్టర్ శ్రీపాద పినాకపాణి గురువు వద్ద నేర్చుకున్నారు. ఆలిండియా రేడియో విజయవాడ కేంద్రంలో ప్రొడ్యూసర్‌గా సంగీతశాఖను సమర్థ వంతంగా నిర్వహించారు. భక్తిరంజని, సంగీత రూపకాలు, యక్షగానాలు, 'సంగీత శిక్షణ' వంటి కార్యక్రమాలతో పేరొందారు. ప్రత్యేకించి ప్రసిద్ధి చెందిన భక్తిరంజనిలో త్యాగరాజు దివ్యనామ కీర్తనలు, తూము నరసింహ దాసు కీర్తనలు, రామదాసుకీర్తనలు తదితర వాటిని కర్ణాటక సంగీతంలోని బాణీని వీడకుండా చక్కని సంప్రదాయశైలిలో పాడేవారు. 1989 డిసెంబరు 29న పరమపదించారు.

సర్ డాన్ బ్రాడ్‌మన్ (జయంతి)



అంతర్జాతీయ క్రికెటర్ డొనాల్డ్ జార్జ్ బ్రాడ్‌మన్ 1908 ఆగస్టు 27న ఆస్ట్రేలియా దేశం న్యూ సౌత్ వేల్స్‌లో జన్మించారు. టెస్ట్ క్రికెట్‌లో యావరేజ్ 99.94తో తనదైన రికార్డు నమోదు చేసి గుర్తింపు పొందారు. 20వ శతాబ్దంలో గొప్ప క్రికెటర్‌గా నిలిచారు. ఆయన సాధనలకు పోస్టల్ స్టాంపు, కాయిన్స్ విడుదల చేశారు. రిటైరయ్యేంతవరకు అడ్మినిస్ట్రేటర్, సెలెక్టర్, రైటర్‌గా ప్రతిభను చాటారు. ఆయన జీవిత చరిత్రను తెలిపే మ్యూజియంను నిర్మించారు. 2001 ఫిబ్రవరి 25 న కన్నుమూశారు. మరణానంతరం 'ఐసీసీ క్రికెట్ హాల్ ఆఫ్ ఫేమ్'లో గుర్తింపు పొందారు.

సుమలత (పుట్టినరోజు)



ప్రముఖ నటి సుమలత 1963 ఆగస్టు 27న మద్రాస్‌లో జన్మించారు. గుంటూరు జిల్లాలో విద్యాభ్యాసం కొనసాగించారు. తెలుగు, మళయాళం, కన్నడ, తమిళ, హిందీ భాషలలో 220కుపైగా సినిమాలలో నటించారు. 'శృతి లయలు'కు ఉత్తమ నటిగా స్పెషల్ జ్యూరీ అవార్డు, కేరళ ఫిల్మ్ క్రిటిక్స్ అవార్డ్, ఫిల్మ్‌ఫేర్ అవార్డు తదితర పురస్కారాలు అందుకున్నారు. కన్నడ నటుడు అంబరీష్‌ను పెళ్లాడి బెంగళూరులో స్థిరపడ్డారు. మండ్య ఎంపీగా వ్యవహరించారు. ఇటీవల ఆమె గౌరవ డాక్టరేట్ పొందారు.

కొందరి స్వార్థంతో రోడ్డున పడ్డ లారీ యజమానులు



మాట్లాడుతున్న లారీ అసోసియేషన్ నాయకులు

హిందూపురం అర్బన్, ఆగస్టు 26: ఎన్టీఆర్ ఆశయసాధనకు ప్రతి ఒక్క లారీ యజమాని ముందుకు రావాలని హిందూపురం లారీ యజమానుల అసోసియేషన్ నాయకులు పేర్కొన్నారు. వారు సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో హిందూపురం ప్రాంతం అత్యంత వెనుకబ డిందని అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు గుర్తించి, ఈ ప్రాంతంలో పారిశ్రామిక వాడను ఏర్పాటు చేసి లక్షలాది మందికి ఉపాధి కల్పించారన్నారు. అందులో లారీ వ్యవస్థ ఒకటన్నారు. రాష్ట్రంలో అతి పెద్ద లారీ యూనియన్ విజయవాడ మొద టి స్థానంలో ఉండగా హిందూపురం రెండో స్థానంలో ఉందన్నారు. ఇక్కడ లారీ యూనియన్ పటిష్టంగా పని చేసిందని, అప్పుడు ఇక్కడి లారీ యజమానులు సంతోషంగా జీవించారని పేర్కొన్నారు. ఓ ముగ్గురు వ్యక్తులు వారి స్వార్థ ప్రయోజనాల కోసం లారీ బ్రో కర్ ఆఫీసు లను సొంతంగా ప్రారంభించి పటిష్టమైన వ్యవస్థను కుప్పకూల్చారని ఆరోపించారు. కంతులు కట్టలేని పరిస్థితుల్లో ఫైనాన్స్ కంపెనీ వారు లారీలను సీజ్ చేసి తీసుకెళ్లారన్నారు. విషయం హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి తన తండ్రిగారి ఆశయాలను కొనసాగిద్దామని లారీ యూనియన్‌కు భరోసా కల్పించారన్నారు. దీంతో 80 శాతం సమస్యలు పరిష్కారం అయ్యాయన్నారు. ఎమ్మెల్యే బాలయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. దౌ ర్జన్యాలకు పాల్పడుతున్న ఆ ముగ్గురు వ్యక్తుల గురించి అప్‌గ్రేడ్ సీఐ ఆంజనేయులుకు తెలియజేశామన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఇందాద్, మల్లికార్జున, క్రిష్టారెడ్డి అయూబ్, మజీద్, హఫీజ్, రహమత్ తదితరులు ఉన్నారు.

'పర్యాటకులకు భద్రత కల్పించండి'

లేపాక్షి, ఆగస్టు 26: ప్రముఖ పర్యాటక కేంద్రమైన లేపాక్షి ఆలయానికి వచ్చే పర్యాటకులకు భద్రత కల్పించాలని ఆలయ కమిటీ చైర్మన్ రమానందన్ సోమవారం హిందూపురం రూరల్ సీఐ జనార్దన్‌ను కోరారు. ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన రూరల్ సీఐ జనార్దన్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువతో సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... నంది విగ్రహం వద్ద రూ.లక్షలు వెచ్చించి పోలీస్ ఔట్‌పోస్టు నిర్మించారని అందులో సిబ్బంది ఉండడం లేదన్నారు. ముఖ్యంగా శని, ఆదివారాల్లో ఆలయానికి భక్తులు, పర్యాటకుల సంఖ్య అధికంగా ఉం టుందన్నారు. సెల్‌ఫోన్‌ల చోరీలు జరుగుతున్నాయని, సిబ్బంది పర్యవేక్షిస్తే తగ్గుముఖం పడతాయన్నారు. సీఐ స్పందిస్తూ తప్పక చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ప్రజాప్రతినిధులు బాధ్యతగా వ్యవహరించాలి

చిక్కబళ్లాపుర జిల్లా ఇన్‌చార్జి మంత్రి డాక్టర్ సుధాకర్



ప్రసంగిస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్

చిక్కబళ్ళాపుర, ఆగస్టు 26: ప్రభుత్వ కార్యక్రమాల్లో అభిప్రాయబేధాలను పక్కనపెట్టి అభివృద్ధికి సహకరించేలా ప్రజాప్రతినిధులు వ్యవహరించాలని చిక్కబళ్ళాపుర జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్ అభిప్రాయపడ్డారు. జిల్లా యంత్రాంగం, జిల్లా పంచాయతీ, కన్నడ సాంస్కృతికశాఖ, యాదవ సమాజం సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని వేణు గోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం ఏర్పాటైన శ్రీకృష్ణాష్టమి వేడుకలను ప్రారంభించి మాట్లాడుతూ ప్రతి పండుగ దేశం యొక్క సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకంగా ఉంటుందన్నారు. వీటిని కేవలం ఒక కులానికి పరిమితం చేయరాదన్నారు. పురాణాల ప్రకారం శ్రీకృష్ణ భగవానుడు ఉపదేశించిన భగవద్గీత నేటికీ మన గొప్ప గ్రంథంగా ఉందన్నారు. కాగా రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు కురిసినా జిల్లాలో ఆశించిన మేరకు కురవలేదని భగవంతుడి కృప రైతులు, ప్రజలపై ఉండాలన్నారు. చిక్కబళ్ళాపుర ఎంపీ డాక్టర్ కే సుధాకర్ మాట్లాడుతూ శ్రీకృష్ణుడి జీవనం తల్లిదండ్రులు, స్నేహితులతో ఎలా మెలగాలో ఎన్నో గుణపాఠాలు నేర్పుతుందన్నారు. ఇస్కాన్ ఆధ్వర్యంలో హరేకృష్ణ నినాదం ప్రపంచవ్యాప్తంగా సాగుతూ భక్తులలో ఐకమత్యం పెంపొందిస్తోందన్నారు. ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్ మాట్లాడుతూ ప్రభుత్వం తరపున శ్రీకృష్ణుడి భవనాన్ని నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో నగరాభివృద్ధి సంస్థ చైర్మన్ కేశవ రెడ్డి, జిల్లా అధికారి రవీంద్ర, జడ్పీ సీఈఓ ప్రకాశ్ నిట్టాలి, డిప్యూటీ కలెక్టర్ డాక్టర్ భాస్కర్, సంఘం నాయకులు మునేగౌడ, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాగాయకుడు గద్దర్‌కు ఘన నివాళి

బెంగళూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ప్రజాకవి, ప్రజా గాయకుడిగా పేరొందిన గద్దర్‌కు నగరంలోని టౌన్‌హాల్‌లో సోమవారం ఏర్పాటైన కార్యక్రమంలో ఘన నివాళులు అర్పించారు. రాజ్యసభ మాజీ సభ్యుడు, సాహితీవేత్త డాక్టర్ ఎల్ హనుమంతయ్య అధ్యక్షత వహించారు. ప్రముఖ విమర్శకులు డాక్టర్ బంజగెరె జయప్రకాశ్ మాట్లాడుతూ గద్దర్ పోరాట జీవితాన్ని బౌద్ధతత్వంవైపు సాగిన తీరును వివరించారు. చింతామణికి చెందిన దళిత పోరాట నేత ఎన్ వెంకటేశ్ కార్యక్రమాన్ని ప్రారంభించగా రాయచూరుకు చెందిన విప్లవసాహితీవేత్త దానప్ప నిలోగల్, గద్దర్ కుమారుడు సూర్యకిరణ్, జి.వి.వెన్నెల, డీఎస్ఎస్ నేత మావళ్ళ శంకర్ తదితరులు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. రాయచూరుకు చెందిన జానపద గాయకుడు అంబణ్ణ అరోలికర్ ఆలపించిన గేయాలు అలరించాయి.



టౌన్‌హాల్‌లో నివాళులు అర్పిస్తున్న ప్రజాసంఘాల ప్రముఖులు

బాబా ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు



బాబా ఆలయంలో ఉట్టికొట్టే పోటీలు

బొమ్మనహళ్ళి, ఆగస్టు 26: స్థానిక అరికెరె శాంతికేతన్ లే అవుట్‌లో వెలసిన శాంతి ధామలో బాబా ఆలయంలో కృ ష్ణాష్టమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా కృష్ణాష్టమి వేడుకలు నిర్వ హిస్తున్నామని ఆలయ ట్రస్టు అధ్యక్షుడు మేడా రామ కృష్ణ వెల్ల డించారు. తెలుగు, కన్నడ సంప్ర దాయంలో ప్రతి పండుగ ఆచ రిస్తున్నామన్నారు. ఉదయం నుంచి శ్రీకృష్ణుడి విగ్రహానికి క్షీరా భిషేకం, పంచామృతాభిషేకం జరి పారు. అనంతరం భజనలు నిర్వ హించారు. సాయంత్రం 6 గంట లనుంచి 9.30వరకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు, పిల్లల చిన్నికృష్ణుడి వేషధారణ, నాట్యా లు అలరించాయి. చిన్నికృష్ణుడి పోటీలు నిర్వహించి బహు మతులు ప్రదానం చేశారు. పోటీల్లో పాల్గొన్న సేవాదళ్ సభ్యులు, సిబ్బందికి, అందరికీ కూడా ప్రోత్సాహకాలు అంద జేశారు. 81మంది పోటీల్లో పాల్గొన్నారు. ఇదే సందర్భంగా ఉట్టి కొట్టే పోటీలు అలరించాయి. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఉత్సవాల్లో తాతయ్యగుప్త, కృష్ణయ్యశెట్టి, వెంకటేశ్ గుప్త, సత్యనారాయణ శెట్టి, సేవాదళ్ సభ్యులు, ట్రస్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



బహుమతులను ప్రదానం చేస్తున్న ఆలయ ట్రస్టు ముఖ్యులు



పాఠశాలలో చిన్నారులకు వేషధారణ

బాగేపల్లిలో కృష్ణాష్టమి సందడి

బాగేపల్లి: పట్టణం సహా తాలూకా వ్యాప్తంగా కృష్ణాష్టమి వేడుకలు సోమవారం ఉత్సాహంగా సాగాయి. వేణుగోపాలస్వామి ఆలయాల్లో పూజలు చేశారు. పట్టణంలోని ప్రముఖ కిడ్స్ పాఠశాలల విద్యార్థులచే చిన్నికృష్ణుడి, రాధల వేషధారణ ఆకట్టుకుంది. తొలుత పాఠశాల ముఖ్యులు కుశాల పూజలు చేశారు. ప్రధానోపాధ్యాయురాలు నూరుబాను మాట్లాడుతూ పవిత్ర సందర్భాన్ని నమ్మకాలకు వీలుగా పండుగలు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఉపాధ్యాయులు భాగ్యలక్ష్మి, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'రైతుల్లో గందరగోళం కలిగించొద్దు'



మీడియాతో రైతుల బృందం

శిడ్లఘట్ట, ఆగస్టు 26: కర్ణాటక ఇండస్ట్రియల్ ఏరియా డెవలప్‌మెంట్ బోర్డు (కేఐఏడీబీ) ఆధ్వర్యంలో జంగమకోటి హోబళిలో భూమి స్వాధీన ప్రక్రియకు సంబంధించి జిల్లా ఇన్ చార్జ్‌మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్ రైతులలో గందరగోళం సృష్టించి దారి తప్పించేలా వ్యవహరించారని యువరైతు నడిపినాయకనహళ్ళి అజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. నడిపి నాయకనహళ్ళి, చుట్టుపక్కల రైతులతో కలసి సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మంత్రి సుధాకర్ శనివారం మధ్యాహ్నం భేటీ అయి ఫలవంతమైన భూమిని స్వాధీన ప్రక్రియనుంచి మినహాయింపు ఇవ్వాలని కోరామన్నారు. వారంరోజుల్లోగా జంగమకోటె క్రాస్‌లో రైతుల సభ నిర్వహిస్తారన్నారు. పహణి ఉండే హక్కుదారుల రైతులతో సమావేశం ఉంటుందని, స్థానిక ఎమ్మెల్యే రవికుమార్ కూడా సభకు ఆహ్వానిస్తామన్నారు. సభలో సుమారు 75శాతం మంది రైతులు కేఐఏడీబీకి భూమిని ఇచ్చేందుకు సుముఖత వ్యక్తం చేశారని అక్కడ మాత్రమే పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు చేస్తామన్నారు. ఒకవేళ 75శాతం మంది రైతులు భూమిని వదులుకునేందుకు అంగీకరిస్తే రైతుల అభిప్రాయం మేరకు కారిడార్ ఏర్పాటుకు ముందుకు సాగుతామని భరోసా ఇచ్చారన్నారు. అయితే ప్రభుత్వ పథకాల గురించి రైతుల సమస్యలు ఆలకిద్దామని, పారిశ్రామిక వాడ ఏర్పాటుతో ఉపాధి సాధ్యమవుతుందని రైతులకు వివరించామని మంత్రి తన ఫేస్‌బుక్‌ఖాతాలో పోస్టు చేశారన్నారు. స్థానిక ఎమ్మెల్యేలను సమక్షంలో తీసుకుని పహణి కల్గిన రైతుల అభిప్రాయాలు సేకరించాలన్నారు. 75శాతం మంది రైతులు భూమిని వదులుకునేందుకు అంగీకరిస్తేనే పారిశ్రామిక వాడ ఏర్పాటుకు ముందుకు సాగాలని కోరారు. పారిశ్రామిక వాడ ఏర్పాటుకు అభ్యంతరం లేదని అయితే ఫలవంతమైన భూమి అత్యధికంగా ఉండడంతో దీన్ని వదులుకునేందుకు సిద్ధంగా లేమన్నారు. రైతులు హిరేబల్ల కృష్ణప్ప, నడిపినా యకనహళ్ళి అశ్వత్థప్ప, నారాయణస్వామి, యణ్ణంగూరు అశ్వత్థగౌడ, తొట్లగానహళ్ళి కృష్ణప్ప, తాదూరు రమేశ్, బసవాపట్టణ కృష్ణప్ప తదితరులు పాల్గొన్నారు.

విద్య సమగ్ర వికాసానికి దోహదపడాలి: ఎమ్మెల్యే

బంగారపేట, ఆగస్టు 26: విద్య అనేది కేవలం పాఠాలకే పరిమితం కాకుండా శారీరక, మానసికంగాను సమగ్ర వికాసానికి దోహదపడాలని ఎమ్మెల్యే, నగర మౌలిక సదుపాయాల ఆర్థికమండలి అధ్యక్షుడు ఎస్ఎన్ నారాయణస్వామి అభిప్రాయపడ్డారు. పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో కోలారు జిల్లా, ఐబీఎం పీయూ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో తాలూకాస్థాయి పీయూ కళాశాల క్రీడా పోటీలను సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ప్రసంగిస్తూ విద్యార్థులు పోటీ మనోభావాన్ని పెంపొందించుకుని ఉత్సాహంగా పాల్గొనాలన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరించాలని నిరాశ నిస్పృహలకు లోను కారాదన్నారు. తాలూకాలో రాణించినవారు జాతీయ, అంతర్జాతీయస్థాయిలో రాణించాలని పిలుపునిచ్చారు. యత్నం, ప్రయత్నం, దైవబలంతో నిరంతరంగా శ్రమించి ముందుకు సాగాలన్నారు. ఐబీఎం కళాశాల ప్రిన్సిపాల్ శ్రీరామరెడ్డి మాట్లాడుతూ ఉన్నత లక్ష్యంతో విద్యార్థులు ముందుకు సాగాలని, నిరంతర శ్రమతో వాటిని అందుకోవాలన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వెంకటేశప్ప, బీఈఓ సుకన్య, పాఠశాల విద్య, పీయూ కళాశాల డైరెక్టర్ బాలకృష్ణ, ప్రిన్సిపాల్ శ్రీరామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నారాయణస్వామి తదితరులు

జింకా అవినీతిపై సీఎంకు ఫిర్యాదు చేస్తాం: సీపీఐ

ధర్మవరం, ఆగస్టు 26: చేనేత పరిశ్రమను నాశనం చేస్తున్న జింకా రామాంజినేయులుపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రాష్ట్ర హ్యాండ్‌లూమ్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామని, ఈ మేరకు త్వరలో విజయవాడ వెళ్తామని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు, చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట నారాయణ అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో సోమవారం వారు మాట్లాడారు. జింకా రామాంజినేయులు అత్యంత టెక్నాలజీ గల పవర్‌లూమ్స్‌ను ఏర్పాటు చేసుకుని విచ్చలవిడిగా ఉత్పత్తులు నిర్వహిస్తూ తోటి నేతన్నల కడుపు కొడుతున్నారన్నారు. ఇలాంటి వ్యక్తుల వల్ల పరిశ్రమ పూర్తిగా నిర్వీర్యమయ్యే పరిస్థితి ఏర్పడిం దన్నారు. మల్బరీ నుంచి గుడ్డు, రేషం దాకా అక్కడే తయారు చేస్తున్న దారాన్ని ఎక్కడికి తరలిస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. చేనేత చట్టం ఉల్లంఘించకపోతే ఆ దారంను తయారు చేసి ఎక్కడికి తరలిస్తున్నారో.. ఏం చేస్తున్నారో.. చెప్పాలన్నారు. ఇలాంటి అక్రమాలు అరికట్టడానికి తిరుపతిలో ఉన్న ఎన్‌ఫోర్స్ కార్యాలయాన్ని ధర్మవరంలో ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. రామకృష్ణను ఆహ్వానించి జింకా రామాంజినేయులు అక్రమాలు పుట్టగా మారిన చేనేత ప్రాజెక్టు వద్ద ధర్నాకు సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ అన్యాయంపై చేనేత మంత్రి సవిత, మరో మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చేనేత కార్మికసంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు వెంకటస్వామి, సీపీఐ పట్టణ కార్యదర్శి రవికుమార్, సహాయ కార్య దర్శి రమణ, చేనేత కార్మిక సంఘం కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.

'రాజకీయాలను కులాలకు ఆపాదించొద్దు'

మడకశిరటౌన్, ఆగస్టు 26 : నియోజకవర్గంలో అందరూ సోదర భావంతో ఉన్నామని, కొందరు ఉద్దేశ పూర్వకంగా రాజకీయాలను కులా లకు అపవాదించి లబ్ధి పొందాలని చూస్తున్నారని టీడీపీ నియోజక వర్గం వక్కలిగ సంఘం నాయకులు అన్నారు. టీడీపీ మడకశిర, అగళి, అమరాపురం మండల కన్వీనర్లు లక్ష్మీనారాయణ, కుమారస్వామి, గణేష్ తదితరులు సోమవారం రాత్రి బాలాజీనగర్‌లోని టీడీపీ కార్యాల యంలో విలేకరులతో మాట్లాడారు. వైసీపీకి చెందిన కరుణాకర్ అనే వ్యక్తి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారన్నారు. ఆవిషయపై గుండుమల తిప్పేస్వామి సోదరుడు జయప్ప ప్రశ్నించినందుకు... తమపై దాడి చేశారని ప్రచారం చేస్తూ రాజకీయ లబ్ధి పొందేందుకు వైసీపీ, కాంగ్రెస్ నేతలు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అది మంచిది కాదన్నారు. వక్కలిగ సంఘం నాయకులు మాజీ ఎంపీపీ బసవరాజు, శ్రీనివాసులు ఉన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ బసవరాజు

సీఎంపై కుమార వ్యంగ్యాస్త్రాలు

బెంగళూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వైట్‌నర్‌తో చెరిపేసిన అక్షరాలు స్పష్టంగా కనిపిస్తున్నా మీ ద్వేషపు కళ్లతో తెరిచిచూస్తే అర్థమవుతుందని సీఎం సిద్దరామయ్య చేసిన పోస్టింగ్‌పై కేంద్రమంత్రి కుమారస్వామి వ్యంగాస్త్రాలు సంధించారు. అక్షరాలను టార్చ్‌తో వెతుకుతున్న గౌరవ ముఖ్యమంత్రికి శోభ తీసుకురాదని ఎద్దేవా చేశారు. ముడాలోని రికార్డులు మీకు ఎలా వచ్చాయి, వాటిని తీసుకొచ్చిన మహానుభావుడు ఎవరు, ఈ రికా ర్డుల న్నీ ముడాలోనే ఉన్నాయా లేదా మీ ఇంట్లో ఉన్నా యా.? ఇంతకీ టార్చ్ వేసినవారు ఎవరు..? మీరేనా లేదా ఇంకెవరైనా ఉన్నారా అంటూ ఎద్దేవా చేశారు. ఈ రికా ర్డులు కోర్టుకు ఇవ్వలేదని, న్యాయస్థానాన్ని దారి తప్పి స్తున్నారా..? అంటూ ప్రశ్నించారు. ప్రజలను దారి తప్పిం చినట్టే కోర్టుకు తప్పుడు సమాచారం ఇస్తున్నారా..? అం టూ ప్రశ్నించారు. ఇలా సోమవారం ఒకరికొకరు ఆరో పణలు, ప్రత్యారోపణలు సోషల్‌మీడియా వేదికగా చేశారు.

దీపావళి పండుగకు నెబ్రాస్కా అధికారిక గుర్తింపు

బెంగళూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతిలో ప్రత్యేక వేడుక అయిన దీపావళి పండుగను అమెరికాలోని నెబ్రాస్కా గవర్నర్ జిమ్ పిల్లెన్ కా ర్యాలయం అధికారికంగా గుర్తించింది. అక్టోబరు 28 నుం చి నవంబరు 2వరకు దీపావళి వారంగా ప్రకటించింది. నెబ్రాస్కా కర్ణాటక రాష్ట్ర వ్యాప్తంగా అక్టోబరు నెలను హిందూ వారసత్వ మాసంగాను గుర్తించారు. హిందూ సాంస్కృతిక సనాతన ధర్మం, ఆచారాలను సంరక్షించడానికి వేడుకలు జరుపుకోవడానికి అమెరికాలోని భారతీయ హిందూ సమాజం కొనసాగించిన కృషి కారణంగా గుర్తింపు సాధ్యమైంది. నెబ్రాస్కాలోని హిందువులు దీపావళి పండుగతోపాటు అక్టోబరు నెలను హిందూ వారసత్వ మాసంగా జరుపుకోవాలని హిందువుల ప్రముఖులు ప్రకటించారు. లింకన్‌లోని నెబ్రాస్కా స్టేట్ కేపిటెల్ బిల్డింగ్‌లో వార్నర్ లెజిస్లేచర్ చాంబర్‌లో ప్రత్యేక సమావేశం జరిగింది. దీపావళి విశిష్టతను తెలిపిన డాక్టర్ ఫణితేజ అడిదంకు హిందువులు స్థానికులు ధన్య వాదాలు తెలిపారు. మల్లికా జయంతి, కొల్లి ప్రసాద్, నవీన్ కంటెం, వెంకట్ జయంతి, రాజా కోమటిరెడ్డి, తాతా రావు పోసూరి, అనిల్ పోతినేని, తపన్‌దాస్, శైలేంద్ర ఘోష్, అరుణ్‌కుమార్ పండిచ్చేరి, దేవికా, మాధవి, పీ యూష్ శ్రీవాత్సవ సమావేశంలో పాల్గొన్నారు. ప్రవీణ్ గుమ్మడవల్లి శ్రీపద్ కాంబ్లె, రామకృష్ణ కిలారు దీపావళి ఉత్సవానికి గుర్తింపు తీసుకురావడంలో ప్రము ఖపాత్ర పోషించారని నెబ్రాస్కా తెలుగుసమితి ప్రకటించింది.

జూపిటర్ 110సీసీ విడుదల



వాహనం విడుదలలో సంస్థ ప్రముఖుడు

బెంగళూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మోటారు వాహన రంగంలో పేరొందిన టీవీఎస్ సంస్థ ఆధ్వర్యం జూపిటర్ 110 సామర్థ్యం కల్గిన సరికొత్త శ్రేణిని మార్కెట్‌లోకి విడుదల చేశారు. నగరంలో సోమవారం ఏర్పాటైన కార్యక్రమంలో సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అనిరుద్ధ హల్దార్ మాట్లాడుతూ సరికొత్త ఫీచర్‌లతో బిఎస్ 6 నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా 4 స్ట్రోక్ ఇంజన్‌ను రూపొందించినట్టు తెలిపారు. ఫ్రంట్ ఫ్యూయెల్ ఫిల్, లాంగ్ సీట్, మోర్ లెగ్‌స్పేస్ వంటివి ప్రత్యేక ఆకర్షణీయంగా ఉన్నాయన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జాపై కేసు



షెడ్లను తొలగిస్తున్న సిబ్బంది

కదిరి, ఆగస్టు 26: స్థానిక హిందూపురం రోడ్డులో ఉన్న సింహకోట వద్ద ఉన్న నాలుగు సెంట్ల ప్రభుత్వ భూమిని కబ్జా చేసినవారిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి సోమవారం తెలిపారు. ఆ స్థలాన్ని మూర్తిపల్లికి చెం దిన రెడ్డెప్ప, జొన్నావీధిలో హరినాథ్ అలియాస్ పాల హరి ఐదు సంవత్సరాల క్రితం కబ్జాచేసి రేకుల షెడ్లు నిర్మించి, వాటిని అద్దెకిచ్చారు. ఆ స్థలం విలువ దాదాపు రూ. కోటి ఉంటుంది. దీన్ని గుర్తించిన మున్సిపల్ కమిషనర్ కిరణ్ కుమార్ వారికి పలుమార్లు నోటీలు ఇచ్చినా ఖాళీ చేయలేదు. దీంతో సోమవారం ఉదయం ఆ రేకుల షెడ్లు, గదులను తన సిబ్బందితో తొలగిస్తుండగా రెడ్డెప్ప, హరి కమిషన్‌కు ఫోన్ చేసి, దుర్భాషలాడి బెదిరించినట్లు మున్సిపల్ కమిషనర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు రెడ్డెప్ప, పాల హరిపై గ్యాబింగ్ కింద కేసు నమోదు చేశారు. కాగా ఇది జిల్లాలోనే మొదటిసారిగా ల్యాండ్ గ్యాబింగ్ కేసు అని, వీరిపై గతంలోనే రౌడీషీట్ ఉన్నట్లు పోలీసులు చెప్పారు.